## 'బెస్ట్ అవైలబుల్ స్కీం'కు దరఖాస్తు చేసుకోవాలి

### జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం

వికారాబాద్, ఫిబ్రవరి 17: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లోని ఎస్సీ విద్యార్థినీవిద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 20 24–25 ఏడాదికిగానూ ఒకటో తరగతి(డే స్కాలర్), ఐదోతరగతి(రెసిడెన్షియల్)ల్లో ఆంగ్ల మాధ్యమంలో పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తామని వికారాబాద్ జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు అర్హత కలిగిన స్కూళ్లను ఎంపిక చేసేందుకు, ఆసక్తి కలిగిన ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. చివరి తేదీ ఈ నెల 21 ఉందన్నారు. పాఠశాల ప్రారంభం నుంచి ప్రభుత్వ గుర్తింపు పొంది ఉండాలని, గత ఐదేండ్ల నుంచి ఏడు, పదో తరగతుల్లో 90% పైన ఉత్తీర్ణులై ఉండాలని, అందులో 50% మొదటి తరగతిలో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. పాఠశాలలో అన్ని వసతులుండాలని, ఫీజుల వివరాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. పాఠశాలకు సొంత భవనంతోపాటు ఆట స్థలం కూడా ఉండాలని, పాఠశాలకు హాస్టల్ వసతి ఉండి.. బాలురకు/బాలికలకు వేర్వేరుగా ఉండాలని వివరించారు.



చేవెళ్లటౌన్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

# వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- హస్తం పార్టీలో చేరిన 24 గంటల్లోపే అవిశ్వాసం ప్రకటించిన బీఆర్ఎస్ జడ్పీటీసీలు
- అదనపు కలెక్టర్‌కు నోటీసు అందించిన 12 మంది సభ్యులు
- మరో ఇద్దరి సభ్యుల మద్దతు..
- మొత్తం 18 మంది జడ్పీటీసీలు
- అవిశ్వాసం నెగ్గి జడ్పీ పీఠాన్ని దక్కించుకునేలా బీఆర్ఎస్ వ్యూహం

## కాంగ్రెస్‌లో చేరిన సునీతారెడ్డికి పదవీ గండం

వికారాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): భారతీయ రాష్ట్ర సమితిలో వివిధ పదవులు అనుభవించి కాంగ్రెస్‌లో చేరిన పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబానికి ఆ పార్టీ షాకిచ్చింది. హస్తం పార్టీలో చేరి 24 గంటలు గడవక ముందే జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ 12మంది బీఆర్ఎస్ జడ్పీటీసీలు నోటీసు అందజేశారు. జిల్లాలో మొత్తం18 మంది సభ్యు లుండగా.. వారిలో 12 మంది మద్దతుతో బీఆర్ఎస్ పార్టీ అవిశ్వాసం ప్రకటించింది. మరో ఇద్దరు జడ్పీటీసీలు కూడా ఆ పార్టీకే మద్దతుండడంతో ఎట్టి పరిస్థితుల్లోనూ అవిశ్వాసం నెగ్గేలా పక్కా వ్యూహంతో బీఆర్ఎస్ పార్టీ ముందుకెళ్తున్నది. అయితే కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దేముల్, బంట్వారం జడ్పీటీసీలు గెలుపొందగా.. అసెంబ్లీ ఎన్నికల సమయం లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన బషీరాబాద్ జడ్పీటీసీ కాంగ్రెస్‌లో చేరగా శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి హస్తం పార్టీలో చేరారు. అవిశ్వాస నోటీసు ఇచ్చిన 14 రోజుల్లోగా బలపరీక్షకు మీటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మరీ ఆ లోగా జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సంబంధించి కలెక్టర్ ఏ నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాల్సిందే..

**అవిశ్వాస నోటీసులిచ్చింది వీరే..**

కాంగ్రెస్‌లో చేరిన జడ్పీ చైర్‌పర్సన్‌పై బీఆర్ఎస్ జడ్పీటీసీలు అవిశ్వాసం ప్రకటించడం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాజకీయంగా కలకలం రేగింది. శుక్రవారం కాంగ్రెస్‌లో చేరడం, మరుసటి రోజే అవిశ్వాసం ప్రకటించడంతో ఉమ్మడి జిల్లా అంతటా ఇదే చర్చ జరుగుతున్నది. జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసు ఇచ్చిన వారిలో వికారాబాద్, పరిగి, మర్పల్లి, ధారూరు, నవాబుపేట, దౌల్తాబాద్, దోమ, కులకచర్ల, మోమిన్‌పేట, పూడూరు, కొడంగల్, తాండూరు జడ్పీటీసీలు సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మానాన్ని అదనపు కలెక్టర్‌కు అందించారు. జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.



అదనపు కలెక్టర్‌కు నోటీసు అందజేస్తున్న 12 మంది జడ్పీటీసీలు

### సునీతారెడ్డి పదవికి రాజీనామా చేయాలి

**-విజయ్‌కుమార్, జడ్పీ వైస్ చైర్మన్**


కాంగ్రెస్‌లో చేరిన సునీతారెడ్డి నైతిక బాధ్యత వహిస్తూ బీఆర్ఎస్ సభ్యత్వానికి, జడ్పీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయకుండా ఇంకా ఆ పదవిలోనే కొనసాగుతుండడంతో ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని అదనపు కలెక్టర్‌ను కలిశాం. తెలంగాణ ఉద్యమంలో వేలాది మంది త్యాగాల అనంతరం రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్న తర్వాత టీడీపీలో ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు బీఆర్ఎస్‌లో చేరి ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా, రెండుసార్లు జడ్పీ చైర్‌పర్సన్‌గా.. ఎమ్మెల్సీ పదవులను అనుభవించి బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేశారు. మహేందర్‌రెడ్డి కుటుంబంతో ఈ ప్రాంతానికి ఎలాంటి లాభం చేకూరలేదు. బేషరతుగా మహేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి, నోటీసు అందకముందే జడ్పీచైర్‌పర్సన్ పదవికి సునీతారెడ్డి రాజీనామా చేయాలి. బీఆర్ఎస్‌లో వివిధ పదవులను అనుభవించి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని జడ్పీటీసీలు జీర్ణించుకోలేకపోతున్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయం

# జన నేతా.. శతమానం భవతి

**ఘనంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు**

**రోగులకు పండ్లు పంపిణీ చేసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 17 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పలువురు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దవాఖానల్లో రోగులకు, ఆశ్రమాల్లో అనాథలకు పండ్ల పంపిణీ వంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టి కేసీఆర్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు కేక్ తినిపించారు. జై కేసీఆర్, జై జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. అదేవిధంగా చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఎమ్మెల్యే యాదయ్య పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా బీఆర్ఎస్‌ను స్థాపించిన గొప్ప యోధుడు కేసీఆర్ అని కొనియాడారు. రానున్న పార్ల మెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, వైస్ ఎంపీపీ ప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింహులు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు రాములు, పామెన ఎంపీటీసీ సత్యనారాయణ చారి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు వెంకటేశ్, సాయినాథ్, నేతలు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంరూరల్ : ఆశ్రమంలో అంధులతో కలిసి కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న దానకిశోర్, పక్కన కలెక్టర్లు నారాయణరెడ్డి, శ్రీహర్ష

## మహిళా సాధికారతకు కృషి

### ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్

కొడంగల్, ఫిబ్రవరి 17 : మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించేందుకు వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు నారాయణరెడ్డి, కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, మహంక్‌మిట్టల్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలతో కలిసి శనివారం కడా కార్యాలయంలో పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. ముందుగా స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడారు. సంఘాల పనితీరు, సభ్యుల కుటుంబ నేపథ్యం, ఆర్థిక స్థితిగతులు, పిల్లల చదువు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దానకిశోర్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి, జీవనోపాధికి ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయాలను స్థాపించాలని యోచిస్తుందన్నారు. మహిళా సంఘాల ద్వారా మహిళ ల్లో మనోధైర్యం పెరుగుతుందన్నారు. మహిళలు ఇంకా వృద్ధిలోకి వ చ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను సభ్యులను అడిగి తెలుసుకున్నా రు. మహిళా సంఘాల సభ్యులు తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. అనంతరం కొడంగల్ పట్టణంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు, స్థలాల పరిశీలన, వేంకటేశ్వరాలయ ప్రాంగణాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ వెంకటేశ్, అధికారులు పాల్గొన్నారు.




హాజరైన మహిళా సంఘాల సభ్యులు.

# కొరత తీరేలా.. రాబడి పెరిగేలా

- వేసవిలో కూరగాయల కొరత తీర్చేలా ఉద్యానవన శాఖ చర్యలు
- జిల్లా అవసరాలతోపాటు హైదరాబాద్‌లోని పలు మార్కెట్లకు జిల్లా నుంచే కూరగాయల ఎగుమతి
- ప్రస్తుతం జిల్లాలో 30 వేల ఎకరాల్లో కూరగాయల సాగు
- మరో 10 వేల ఎకరాల్లో విస్తరించేందుకు కార్యాచరణ

రంగారెడ్డి, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : జిల్లా కూరగాయల సాగుకు పెట్టింది పేరు. అవసరాలకు సరిపడా కూరగాయలను ఇక్కడి రైతులు పండిస్తున్నప్పటికీ.. హైదరాబాద్ నగర వాసులకు కూడా ఇక్కడి నుంచే ఎగుమతి అవుతుండడంతో సాగు విస్తీర్ణాన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఉన్నదని జిల్లా ఉద్యానవన శాఖ సంకల్పించింది. మార్కెట్లలో కూరగాయల ధరలు ఆకాశన్నంటడం..వేసవిలో కూరగాయల కొరత ఏర్పడి ధరలు మరింత పైపైకి ఎగబాకే అవకాశం ఉండడంతో కొరతను అధిగమించేందుకు అవసరమైన చర్యలను చేపట్టింది. ప్రస్తుతం జిల్లాలో ప్రతి సీజన్‌లోనూ 30 వేల ఎకరాల్లో పంటలను సాగు చేస్తుండగా..విస్తీర్ణాన్ని మరో 10 వేల ఎకరాలకు పెంచేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నది.



**జనాభాకు తగ్గట్టుగా.. కొరత లేకుండా..**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ స్టడీ ప్రకారం.. ఒక వ్యక్తి రోజుకు 325 గ్రాముల కూరగాయలను ఆహారంగా తీసుకోవాల్సి ఉంటుంది. కనీసం 200 గ్రాములు తీసుకున్నా.. జిల్లా జనాభాకు తగ్గట్టు ఏడాదికి 1.65 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం. జిల్లా లో ఇంతకంటే ఎక్కువగానే అంటే 1.95 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు పండుతున్నాయి. అయితే హైదరాబాద్ నగరవాసుల అవసరాలను సైతం జిల్లాలో పండిన కూరగాయలే తీరుస్తుండడంతో ఇంకా 1.60 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయల అవసరం ఏర్పడుతున్నది. ఈ కొరతను అధిగమించాలంటే కూరగాయల సాగు విస్తీర్ణాన్ని మరో 10 వేల ఎకరాలకు పెంచాల్సిన అవసరం ఉందని ఉద్యానవన శాఖ భావిస్తున్నది. ఈ మేరకు అవగాహన సమావేశాలు నిర్వహించి రైతులను చైతన్యపరుస్తున్నది.

**కూరగాయల సాగుకు కేరాఫ్ జిల్లా ..**

జిల్లాలోని అనేక పల్లెలు కూరగాయల సాగుకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. కొన్ని దశాబ్దాలుగా రైతు కుటుంబాలు కూరగాయలను పండిస్తూ బతుకుతున్నాయి. చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ తదితర ప్రాంతాలు క్యారెట్ సాగుకు పేరుగాంచాయి. అలాగే ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్ ప్రాంతాల్లో ఆకుకూరలు, షాద్‌నగర్‌లో పచ్చిమిర్చి అధికంగా పండుతున్నది. ఉల్లిగడ్డ, ఆలుగడ్డల సాగుకు ఇక్కడి భూములు యోగ్యంగా లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. వివిధ రకాల కూరగాయలతోపాటు, పాలకూర, చుక్కకూర, పొనగంటి కూర, మెంతికూర, ఎర్ర గోంగూర వంటి కూరగాయలను పండిస్తూ జిల్లా రైతాంగం ఆర్థిక ప్రగతిని సాధిస్తున్నది.

**ఇక్కడి నుంచి పలు ప్రాంతాలకు ..**

జిల్లా అవసరాలకు పోగా..మిగిలిన కూరగాయలు హైదరాబాద్ మహానగరంతోపాటు చుట్టూ ఉన్న ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. అయితే హైదరాబాద్‌కు చెంతనే ఉన్న రంగారెడ్డి జిల్లా గత పదేండ్ల కాలంలో నలువైపులా శరవేగంగా విస్తరిస్తుండడం కూరగాయల సాగుపై ప్రభావం పడింది. పెద్ద ఎత్తున పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటవుతుండడం..వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతుండడంతో కూరగాయల సాగు క్రమక్రమంగా తగ్గిపోతున్నది. ఈ పరిస్థితుల్లో కూరగాయల సాగును ప్రోత్సహించి గత వైభవాన్ని జిల్లా చాటేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**కాలం ఏదైనా.. ఫుల్ డిమాండ్..**

ప్రస్తుత పరిస్థితుల్లో ఏ కూరగాయకైనా మంచి డిమాండ్ ఉంటున్నది. ఇక వచ్చేది వేసవి కాలం. కూరగాయలు దొరకడం మరీ కష్టం. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత యాసంగిలో జిల్లా రైతాంగం కూరగాయల పంటలనే సాగు చేయాలని ఉద్యానవనశాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ రకం కూరగాయకైనా కిలో రూ.60 ధర పలుకుతున్నది. ఇతర పంటలతో పోలిస్తే కూరగాయల సాగుతో మూడింతల లాభాన్ని రైతులు పొందొచ్చు. గతంలో సరైన నీటి వనరులు లేక రైతులు కూరగాయల సాగుకు ముందుకు వచ్చే పరిస్థితి ఉండేది కాదు. ఇప్పుడా ఇబ్బంది లేదు. పుష్కలమైన సాగునీరు అందుబాటులో ఉన్నది. కూరగాయలను విక్రయించుకునేందుకు రవాణా వ్యవస్థ సైతం మెరుగుపడింది. ఎకరం వరి సాగుకు ఉపయోగించే నీటితో నాలుగు ఎకరాల్లో కూరగాయలను సాగు చేయొచ్చని అధికారులు సూచిస్తున్నారు. వచ్చేది వేసవి కాలం కావడంతో మంచి ధర పలికే అవకాశం ఉన్నందున యాసంగిలో అధిక విస్తీర్ణంలో కూరగాయలు, ఆకుకూరలను సాగుచేయాలని అధికారులు కోరుతున్నారు.

### రాయితీతో ప్రోత్సాహం



కూరగాయల కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. పాలీ హౌస్, నెట్‌హౌస్‌లలో కూరగాయలను సాగుచేసేందుకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తున్నది. జీడిమెట్ల, ములుగు ప్రాంతాల్లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన, శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. నాణ్యమైన విత్తనాల కొనుగోలు చేయడంలో సహకరించడంతోపాటు సబ్సిడీపై కూరగాయల మొక్కలను అందజేస్తున్నాం. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూరగాయలను సాగు చేయాలని సూచిస్తున్నాం. ఇందుకు సంబంధించి స్ప్రింక్లర్లను ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం చొప్పున ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్నది. రైతు లు సద్వినియోగం చేసుకుని కూరగాయల సాగును మరింతగా పెంచాలి.

**-నీరజాగాంధీ, జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి**

# హెచ్‌ఎండీఏలో టెండర్లు

**దాదాపు 4 నెలల తర్వాత ప్రాజెక్టుల అభివృద్ధి పనుల్లో కదలిక**

**ప్రాజెక్టులను పట్టించుకోలేదని నమస్తే తెలంగాణలో కథనాలు**

**ఎట్టకేలకు స్పందించిన హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : హెచ్‌ఎండీఏ ఎట్టకేలకు ప్రాజెక్టుల పనులను పూర్తి చేసేందుకు సిద్ధమైంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధిలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్న హెచ్‌ఎండీఏ వేల కోట్ల రూపాయలతో నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో పలు ప్రాజెక్టులను చేపట్టింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా పక్కన పెట్టేసింది. దీనిపై నమస్తే తెలంగాణలో పలు కథనాలు వచ్చాయి. వీటిపై స్పందించిన ఉన్నతాధికారులు ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులను గుర్తించి వాటిని పూర్తి చేసేందుకు అవసరమైన బడ్జెట్ అంచనాలను రూపొందించి టెండర్లను ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగానే రాజేంద్రనగర్ బుద్వేల్‌లో 182 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ చేపట్టిన లేఅవుట్‌లో అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.354 కోట్లు, అదేవిధంగా మోకిలలో చేపట్టిన లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పన కోసం మరో రూ.47 కోట్లతో కలిపి రెండు టెండర్లను హెచ్‌ఎండీఏ ఆహ్వానించింది. ఎన్నికల కోడ్ మూలంగా నవంబర్, డిసెంబర్ నెలలు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రెండు నెలలు కలిపి దాదాపు 4 నెలల తరువాత టెండర్లు ఆహ్వానించడం శుభపరిణామం. అయితే ఇవేకాకుండా మూసీ,ఈసీ నదులపై 5 చోట్ల హైలెవల్ బ్రిడ్జిలను నిర్మాణానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేనాటికి ఎన్నికలు వచ్చాయి. అలాగే 85 ఎకరాల్లో చేపట్టిన కొత్వాల్ గూడ పార్కు పనులు, బాచుపల్లి జంక్షన్‌లోని ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు 2–3 నెలలుగా నిలిచిపోయాయి. వీటితో నగర శివారు ప్రాంతాల్లో 6 చోట్ల (బుద్వేల్, మోకిల, తొర్రూరు, బహుదూర్‌పల్లి, బాచుపల్లి, తుర్కయాంజాల్) చేపట్టిన హెచ్‌ఎండీ లేఅవుట్లలో అభివృద్ధి పనులు ఎక్కడివి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. తాజాగా ఇందులో రెండు లేఅవుట్లకు సంబంధించిన పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు.




# నుమాయిష్.. నేడే ఆఖరు

### 20 లక్షలు దాటిన సందర్శకులు

అబిడ్స్, ఫిబ్రవరి 17 : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన( నుమాయిష్) ఆదివారం ముగియనున్నది. శనివారం నాటికి సందర్శకుల సంఖ్య దాదాపు ఇరవై లక్షలు దాటింది. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో దాదాపు 2400 వరకు స్టాళ్లతో ప్రతి ఏటా జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తారు. ఈ సారి స్టాల్ హోల్డర్స్ విజ్ఞప్తి మేరకు నుమాయిష్‌ను మూడు రోజులు పెంచుతున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, మంత్రి డి. శ్రీధర్‌బాబు ప్రకటించారు. దీంతో 18వ తేదీన నుమాయిష్ ముగియనున్నది. నగరంతో పాటు పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఎగ్జిబిషన్‌ను సందర్శించి స్టాల్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. మైదానంలో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులు, అమ్యూజ్‌మెంట్ పార్కులు సందర్శకులతో కిటకిటలాడాయి. శనివారం అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నుమాయిష్‌కు సహకరించిన అధికారులు, స్టాల్ నిర్వాహకులు, ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విద్యాసంస్థలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాలు, బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి బి. హనుమంతరావు, సంయుక్త కార్యదర్శి చంద్రజిత్ సింగ్, కోశాధికారి ఏనుగుల రాజేందర్‌కుమార్, వనం వీరేందర్, హరినాథ్‌రెడ్డి, వినయ్ ముదిరాజ్‌లతో పాటు వివిధ మేనేజింగ్ కమిటీల సలహాదారులు, కన్వీనర్‌లు, కో కన్వీనర్‌లు పాల్గొన్నారు.